క్లుప్తంగా

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో మహిళా సమాఖ్య సభ్యులకు సోమవారం తెలంగాణ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. పీఆర్వో రాంగోపాల్ శర్మ మహిళలకు పొదుపు, రుణాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు సేవలను వినియోగించుకోవాలన్నారు. ఐకేపీ సీసీ స్వరూప, వీవోఏలు విజయ, సుజాత, వనిత తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



ఎడపల్లి: ఎడపల్లి గ్రామానికి చెందిన బీజేపీ బూత్ సభ్యుడు కల రామచందర్ కొన్ని రోజుల క్రితం మరణించాడు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎంపీ అర్వింద్ బూత్ స్థాయి సభ్యుల సంక్షేమ నిధి నుంచి రూ.లక్ష చెక్కు అందజేశారు. ఎడపల్లి బీజేపీ మండలాధ్యక్షుడు కోలా ఇంద్రకరణ్, సాయి, కటకం అరుణ్, కల్యాణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు




రుద్రూర్: కోటగిరిలోని మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో సోమవారం ఆర్బీఎస్కే వైద్యులు జయప్రకాశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్తహీనత, హిమోగ్లోబిన్ స్థాయి పరీక్షలు నిర్వహించారు. కళాశాలలో 83 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి, అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. హెచ్ఈవో గోవర్ధన్, సూపర్‌వైజర్ జ్యోతి, కళాశాల హెల్త్ అసిస్టెంట్ సావిత్రి, ఆరోగ్య కార్యకర్త శ్రీదేవి పాల్గొన్నారు. అనంతరం కళాశాలలోని వంటగది పరిశీలించి తాజా కూరగాయలు వాడాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు.

ప్రొటెస్ట్ మార్చ్‌ను విజయవంతం చేయాలి

ఆర్మూర్‌టౌన్: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఫిబ్రవరి 3న ఢిల్లీలో నిర్వహించే ప్రొటెస్ట్ మార్చ్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ కోరారు. ఆర్మూర్‌లో సోమవారం పీడీఎస్‌యూ ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త విద్యా విధానంతో ఐడియాలాజికల్ ఫ్రేమ్ వర్క్ దెబ్బతింటుందన్నారు. నాయకులు ప్రిన్స్, వంశీ, గంగాధర్, విఠల్, రేఖ, గౌతమి, దేవిక పాల్గొన్నారు.

ఎన్‌వైకే సలహా మండలి సభ్యుడిగా వెంకటేశ్



బోధన్‌టౌన్: జిల్లా నెహ్రూ యువ కేంద్రం(ఎన్‌వైకే) సలహా మండలి సభ్యుడిగా బోధన్‌కు చెందిన పెర్క వెంకటేశ్ నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, ఎంపీ అర్వింద్‌కు వెంకటేశ్ కృతజ్ఞత తెలిపారు.

పశువైద్యులు అందుబాటులో ఉండాలి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పోచమ్మ కాలనీ సమీపంలో గల వెటర్నరీ ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండాలని రైతుల ఆందోళనకు దిగారు. సరైన సమయంలో వైద్యం అందగా పశువులు మృతి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో మందులు సైతం అందుబాటులో లేక ప్రైవేటు మెడికల్‌కు వెళ్లాల్సి వస్తోందని వెటర్నరీ ఏడీ జియాఉద్దీన్‌తో వాగ్వాదానికి దిగారు. రైతులకు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం ఏడీ జియాఉద్దీన్ మాట్లాడుతూ రైతులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని, సిబ్బంది సమయపాలన పాటించకపోతే ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేద్దాం

- నందిపేట మండల సమావేశంలో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



నందిపేట సభలో మాట్లాడుతున్న పైడి రాకేశ్‌రెడ్డి

నందిపేట్: పేదల అభ్యున్నతి కోసం పార్టీలకతీతంగా బాధ్యతాయుతంగా పనిచేద్దామని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం నందిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివారు. అనంతరం చేపట్టబోయే కార్యక్రమాల గురించి చర్చించారు. రాజకీయ నాయకులు అశాశ్వతమని, అధికారులు శాశ్వతమని, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఎన్నికలప్పుడు రాజకీయాలు చేయాలని, మిగతా కాలంలో అందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. నందిపేట బస్‌డిపో స్థలాన్ని సుందరంగా తీర్చిదిద్ది యువతకు ఆటస్థలం చేస్తామన్నారు. అధికారులు ప్రజల సొమ్మును వృథా చేయకుండా ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుని అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. ఆర్మూర్‌ను తెలంగాణలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు.

నందిపేటను మున్సిపాలిటీ చేస్తా

నందిపేట పట్టణాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఇందుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. నందిపేటలో పూర్తిగా అసైన్‌మెంట్ భూములు ఉన్నందుకు పేదవారు ఇల్లు నిర్మించుకోలేని పరిస్థితి నెలకొందని, ఉన్నతాధికారుల సూచన మేరకు సమస్య పరిష్కారానికి నందిపేటను మున్సిపాలిటీ చేసేందుకు కృషి చేస్తామన్నారు. జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు మాట్లాడుతూ.. పల్లెప్రగతి, వికసిత్ భారత్ కార్యక్రమాలతో పల్లెలలో చాలా అభివృద్ధి జరిగిందన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

సర్పంచులకు సన్మానం

నందిపేట, డొంకేశ్వర్ మండలాలకు చెందిన వివిధ గ్రామాల సర్పంచులకు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్‌లు సన్మానించారు. మూడు రోజుల్లో పదవీ కాలం ముగుస్తుండడంతో వారు చేసిన అభివృద్ధిని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్, ఎంపీడీవో నాగవర్ధన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గంగారాం పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

- ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేస్తాం
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌రూరల్: తమ ప్రభుత్వ పాలనలో గ్రామాలాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేస్తామని బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ మండలంలోని భవానీపేట్ దుర్గమ్మ ఆలయంలో కొబ్బరికాయలు కొట్టి ఆయన మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సంగం, బండార్‌పల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన జీపీ భవనాలను ప్రారంభించారు. సంగం సర్పంచ్ అంజమ్మ, సొసైటీ చైర్మన్ ముత్తారెడ్డి కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి ప్రతి ప్రభుత్వ పాఠశాలలో 400 మంది విద్యార్థులను ఉండేలా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. ఆర్డీవో రాజాగౌడ్, జెడ్పీటీసీ లక్ష్మి, ఎంపీపీ బుద్దె సావిత్రి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, పీసీసీ డెలిగేట్ గంగశంకర్, మండలాధ్యక్షుడు నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

సొంత నిధులతో గిడ్డంగి నిర్మాణం అభినందనీయం

బోధన్‌టౌన్: సొసైటీలోని సొంత నిధులతో గోదాం నిర్మించుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆచన్‌పల్లిలో గోదాం నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సొసైటీ వారు డబ్బులు కూడబెట్టి రూ.30 లక్షలతో 500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ ఉంచడానికి గోదాము నిర్మించుకుంటున్నారన్నారు. సొసైటీ చైర్మన్ ఉద్మీర్ లక్ష్మణ్, కార్యదర్శి ఉమాకాంత్, ఏవో సంతోష్, నాయకులు పాషా మోయినొద్దీన్, డీసీసీ డెలిగేట్ గంగశంకర్, తాహెర్‌బిన్ హందాన్, నరేందర్‌రెడ్డి, మందర్న రవి ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



ప్రశంస పత్రాలతో విద్యార్థులు

బాల్కొండ: ముప్కాల్ కేజీబీవీ పాఠశాల విద్యార్థులు హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫు పోటీల్లో ప్రతిభ కనబరిచారని పాఠశాల ఎస్‌వో వినోద తెలిపారు. విద్యార్థులు ఎం మహేశ్వరి, హర్షవర్ధిని, రష్మిత, శృతి కీర్తి, శాలిని గోల్డ్‌మెడల్, శివనందిని, అఖిల, దివ్యశ్రీ, అస్మిత, ఆరాధ్య, మనస్విని రజత పతకం సాధించారన్నారు. అలాగే ఓవరల్ చాంపియన్‌షిప్ సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం పాఠశాలలో అభినందించారు. పీఈటీ ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అఖిలాండ సాధు పరిషత్'లో మంగిరాములు

నందిపేట్: మహారాష్ట్రలోని పండరీపూర్‌లో జరుగుతున్న అఖిలాండ సాధు పరిషత్ మహాసభలలో నందిపేటలోని శ్రీ కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ పాల్గొన్నారు. హిందూ మతం ప్రాముఖ్యత, దైవభక్తి గురించి ఆయన ప్రవచించారు. సాధు పరిషత్ ఆధ్వర్యంలో మంగిరాములు మహరాజ్‌ను సన్మానించారు.

వైస్ చైర్మన్‌ను ఇన్‌చార్జిగా నియమించాలి



అంబేడ్కర్ చౌరస్తాలో రిలే దీక్షలో కూర్చున్న కౌన్సిలర్లు, ముస్లిం ఐక్యవేదిక సభ్యులు

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్మున్నుకు ఇన్‌చార్జి బాధ్యతలను ప్రభుత్వం అప్పగించాలని మైనారిటీ కౌన్సిలర్లు, ముస్లిం ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ముస్లిం మైనారిటీ కౌన్సిలర్లు, ముస్లిం ఐక్యవేదిక సభ్యులు చేపడుతున్న రిలే నిరాహార దీక్ష సోమవారం రెండో రోజుకు చేరుకుంది. వారు మాట్లాడుతూ.. అవిశ్వాసం నెగ్గి 25 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. దీంతో ఆర్మూర్ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. చైర్మన్ ఎన్నిక అయ్యే వరకు వైస్ చైర్మన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్మున్ను, కౌన్సిలర్ ఇంతియాజ్, అతిక్, రేహ్మన్ పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయలంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి పాల్గొని లింగానికి పంచామృతలతో అభిషేకం చేశారు. భక్తులు స్వామివారి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పీసీ గంగారెడ్డి, సుమన్, మల్లయ్య, మీనచందు, అయ్యప్పశ్రీన, బొండ్ల ఆనంద్ పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. వెళ్లేదెలా..?



గొట్టుముక్కల-మందాపూర్ రోడ్డులో గుంత

మాక్లూర్: మండలంలోని గొట్టుముక్కల – మాందాపూర్ మధ్య ఆర్‌అండ్‌బీ బీటీ రోడ్డుపై గుంత (రంధ్రం) ఏర్పడడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల రాత్రి సమయంలో ధర్మోరాకు చెందిన ఒకరి వాహనం అందులో ఇరుక్కుని తీవ్రంగా వాహనదారుడు గాయపడినట్లు స్థానికులు తెలుపుతున్నారు. రోడ్డుకు అడుగున ఉన్న కల్వర్టు పైప్ పగిలిపోయి పెద్ద రంధ్రం ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందంటున్నారు.

నాణ్యతకు తూట్లు



నూత్‌పల్లి రోడ్డులో..

డొంకేశ్వర్: డొంకేశ్వర్ కమాన్ నుంచి నూత్‌పల్లి గ్రామం వరకు లక్షలు వెచ్చించి వేసిన బీటీ రోడ్డుకు ఏడాది కాకముందే తూట్లు పడుతున్నాయి. సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో పలు చోట్ల గుంతలు తేలాయి. గుంతలను పూడ్చి ప్యాచ్ వర్క్ చేయాల్సిన కాంట్రాక్టర్‌కు బిల్లులు ముట్టడంతో ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదు. అయితే.. గుంతలను తప్పించబోయి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

నాసిరకంగా ప్రహరీ పనులు




పనుల్లో వినియోగిస్తున్న నాసిరకం ఇసుక, డస్ట్

ఎడపల్లి: మండలంలోని కుర్నాపల్లి అబ్బయ్య దర్గా వద్ద ప్రహరీ నిర్మాణంలో నాణ్యత పాటించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నాసిరకం ఇసుక వినియోగిస్తున్నారని, ఇసుకకు బదులు డస్ట్ వాడుతున్నారని పేర్కొన్నారు. సీడీపీ నిధులు రూ.5 లక్షలు, స్టేట్ డెవలప్‌మెంట్ నిధులు రూ.5 లక్షలతో దర్గా వద్ద ప్రహరీ నిర్మాణం చేపట్టారు. పనుల్లో నాణ్యత పాటించకున్న అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయమై పీఆర్ ఏఈ లిఖితను వివరణ కోరగా పనులను పర్యవేక్షించి చర్యలు చేపడతామన్నారు.

సంక్షిప్తం


తహసీల్దార్‌కు సన్మానం



పెర్కిట్: ఆలూర్ తహసీల్దార్ నరేశ్‌ను సోమవారం స్థానిక ప్రజా ప్రతినిధులు సన్మానించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నరేశ్ ఉత్తమ అధికారిగా ప్రశంసపత్రం అందుకున్నారు. దీంతో స్థానిక ప్రజా ప్రతిధులు సన్మానించారు. సర్పంచ్ కల్లెం మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, ముక్కెర విజయ్, ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, సింగెడి సత్యం, వెల్మ గంగారెడ్డి, ఆర్ఐ రఫీక్ పాల్గొన్నారు.

బాల్కొండ ఎంపీడీవోకు..

బాల్కొండ: బాల్కొండ ఎంపీడీవో సంతోష్‌కుమార్ బెస్ట్ సెక్టోరియల్ అధికారిగా ఎంపిక కావడంతో సోమవారం



ఈజీఎస్ సిబ్బంది సన్మానించారు. ఏపీవో ఇందిర, టీఏ ధనుంజయ్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో దాతకు..



బాల్కొండ: ముప్కాల్‌లో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం కోసం రూ.50 వేలు విరాళం ఇచ్చిన చింతకింది ఉదయ్‌కిరణ్‌రెడ్డిని సోమవారం స్టేడియం నిర్మాణ బాధ్యులు సన్మానించారు. కబడ్డీ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు గంగాధర్, రిటైర్డ్ టీచర్ అంజయ్య, పీడీ రాజుకుమార్, సాయన్న, మోతే గంగారెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

పాలకవర్గ సభ్యులకు సన్మానం



రెంజల్: ఉమ్మడి కుటుంబంలా కలిసి పనిచేయడంతోనే గ్రామంలో సమస్యలను పరిష్కరించగలిగామని రెంజల్ సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం రెంజల్, దండిగుట్ట గ్రామాల సర్పంచ్‌లతో పాటు పాలకవర్గం సభ్యులను అధికారులు సన్మానించారు. సర్పంచ్‌లు రమేశ్, శ్రీదేవి మాట్లాడుతు ప్రజలతో పాటు అధికారులు సహకారం అందించారని వివరించారు. జెడ్పీటీసీ విజయ, ఎంపీవో గౌస్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, బీజేపీ నాయకులు కిశోర్, సంతోష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సాగేలా చూడాలి

- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



పోడు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బాల్కొండ: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఆగకుండ ముందుగు సాగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఫైళ్లు పెండింగ్‌లో ఉండవద్దన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఆర్డీవో వినోద్‌కుమార్, డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

పోడు భూముల పట్టా పాస్‌బుక్‌ల పంపిణీ

కమ్మర్‌పల్లి: మండలంలోని అమీర్‌నగర్, డీసీ తండా, బిలియానాయక్ తండాలకు చెందిన గిరిజనులకు పోడు భూముల పట్టా పాస్‌బుక్‌లను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. బాల్కొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఐదుగురు గిరిజనులకు పాస్‌బుక్కులు అందజేశారు. ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రకాష్‌నాయక్, వైస్ ఎంపీపీ కాలేరు శేఖర్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తరిస్తాం



హున్సాలో అరటి తోటలను సందర్శించిన ఆయిస్టర్ సంస్థ ప్రతినిధులు, సభ్యులు

బోధన్: గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరిస్తామని హైదరాబాద్‌కు చెందిన ఆయిస్టర్ (ఆర్గనైజేషన్ బై యూత్ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ అండ్ ఎన్విరాల్‌మెంటల్ రీకప్) స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు సునీల్ సింగాడే అన్నారు. రూరల్ డెవలప్‌మెంట్ క్యాంప్‌లో భాగంగా సోమవారం సాలూర మండలంలోని హున్సా శివారులో సాగు చేసిన వివిధ పంట పొలాలను సంస్థ ప్రతినిధుల బృందం సందర్శించి రైతులతో మాట్లాడారు. పంట దిగుబడులు, సేంద్రియ సాగు విషయాలను తెలుసుకున్నారు. సాలూర మండల కేంద్రంలో రైతులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు సునీల్ సింగాడే మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పర్యావరణం అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించే లక్ష్యంతో తమ సంస్థ ఏర్పాటు చేశామన్నారు. సంస్థ ప్రతినిధులు ఆనంద్, ప్రసాద్, రజిత, భాగ్యశ్రీ, సోహెల్ పాల్గొన్నారు.

జంతు సంరక్షణ పక్షోత్సవాలు



కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ సంతోష్‌రెడ్డి

రుద్రూర్: మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రంలో జంతు సంరక్షణ పక్షోత్సవాల సందర్భంగా సోమవారం పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలను వేశారు. మండలంలోని 19 కుక్కలకు టీకాలు వేసినట్లు వెటర్నరి సిబ్బంది తెలిపారు. మండల పశు వైద్యాధికారి సంతోష్ రెడ్డి, వెటర్నరి అసిస్టెంట్ సాయిరాజ్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని పోచమ్మ గల్లీలో గల వెటర్నరీ ఆస్పత్రిలో సోమవారం కుక్కలకు రేబీస్ టీకాలను వేసినట్లు వెటర్నరీ ఏడీ జియాఉద్దీన్ అన్నారు. రేబీస్ వ్యాధి లక్షణలు, వ్యాప్తి చెందే విధానం గురించి వివరించారు. మొత్తం 42 కుక్కలకు టీకాలు ఇచ్చామని తెలిపారు. స్టాఫ్ మల్లేష్, శోభ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నందిపేట్: నందిపేట ప్రభుత్వ పాఠశాలలో సోమవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జంతు సంక్షేమం– పౌరుల బాధ్యత అనే అంశంపై పోటీలు నిర్వహించారు. మండల పశుసంవర్ధక అధికారి హన్మంత్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం మంజుల పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మాక్లూర్: మండలంలోని ఒడ్డేట్‌పల్లి సర్పంచ్‌తో పాటు మాక్లూర్ సొసైటీ డైరెక్టర్లు సోమవారం ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డితో కలిసి వెళ్లి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో సర్పంచ్ రామడోళ్ల సుధ, ఆమె భర్త రాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు జనార్దన్, వార్డు సభ్యుడు చింతల మోహన్, కొండపల్లి గణపతి, మాక్లూర్ సొసైటీ డైరెక్టర్లు భూరోళ్ల అశోక్, గుండాల శేఖర్, జిట్టా గంగాధర్, కోమాల అశోక్, స్వర్ణ మంజుల ఉన్నారు. గంగాధర్‌గౌడ్, దయాకర్‌రావు, రవిప్రకాష్, లచ్చారెడ్డి, రాజేశ్వర్, పురుషోత్తం, ప్రవీణ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్, సొసైటీ డైరెక్టర్లు

■ నేడు మండల సర్వసభ్య సమావేశం

పెర్కిట్: ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ పస్క నర్సయ్య అధ్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సకాలంలో హాజరు కావాలని కోరారు.

బాల్కొండ: ముప్కాల్ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ సామ పద్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

■ నేడు సుద్దులంలో పశువైద్య శిబిరం

రుద్రూర్: కోటగిరి మండలం సుద్దులంలో మంగళవారం పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు పశువైద్యాధికారి సురేష్ తెలిపారు. పశువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	గుంటూరు కారం (తెలుగు) – 12.30, 7.00, 10.20
	నా సామిరంగ (తెలుగు) – 3.50
స్క్రీన్-2 –	ఫైటర్ (హిందీ) 3డీ – 11.15, 2.50, 6.25, 10.00
స్క్రీన్-3 –	హనుమాన్ (తెలుగు)– 11.20, 2.40, 6.00, 9.20
స్క్రీన్-4 –	కెప్టెన్ మిల్లర్ (తెలుగు) – 12.50, 4.00, 10.30
	హనుమాన్ (తెలుగు) – 7.10